



తెలంగాణ ఉద్యమకాలంలో అమరుడు సిరిపురం యాదయ్య ఆత్మబలిదానం చేస్తుండగా రాజేశ్ తీసిన ఫొటో (ఇన్‌సెట్‌లో ఫొటోగ్రాఫర్ రాజేశ్)

# 'నమస్తే తెలంగాణ' ఫొటో జర్నలిస్టు రాజేశ్ మృతి

- హఠాన్మరణంపై పలువురు ప్రముఖుల సంతాపం
- ముగిసిన అంత్యక్రియలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ)/చాదర్‌ఘాట్: నమస్తే తెలంగాణ సీనియర్ ఫొటో జర్నలిస్టు నర్రె రాజేశ్ (45) హఠాన్మరణం చెందారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఉదయం అస్వస్థతకు గురవ్వడంతో కుటుంబసభ్యులు స్థానిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ రాజేశ్‌ను పరీక్షించిన డాక్టర్ ఛాతినొప్పికి గురయ్యాడని, మెరుగైన చికిత్స కోసం వెంటనే దవాఖానకు తరలించాలని సూచించారు. డాక్టర్ సూచన మేరకు యశోద దవాఖానకు తరలించి, అక్కడ చికిత్స అందిస్తుండగానే రాజేశ్ తుదిశ్వాస విడిచారు. భౌతికకాయాన్ని సైదాబాద్‌కాలనీలోని ఆయన నివాసానికి తరలించారు. రాజేశ్‌కు భార్య లావణ్య, కూతురు శివాణి, కుమారుడు వర్షిత్ ఉన్నారు. మృతి విషయం తెలిసిన వెంటనే తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, నమస్తే తెలంగాణ సంపాదకుడు తిగుళ్ల కృష్ణమూర్తి, తెలంగాణ టుడే ఎడిటర్ కే శ్రీనివాస్‌రెడ్డి, బ్యూరో చీఫ్ ఓరుగంటి సతీశ్, చీఫ్ ఫొటో జర్నలిస్ట్ చీఫ్ ఏ గంగాధర్, వివిధ పత్రికల సీనియర్ జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టులు రాజేశ్ నివాసానికి చేరుకొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. రాజేశ్ మృతిపట్ల సంతాపం ప్రకటించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆత్మీయుల సందర్శన అనంతరం రాజేశ్ భౌతికాయానికి సైదాబాద్‌కాలనీలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు ముగిశాయి.

### కేటీఆర్, హరీశ్, కవిత, సంతోష్ సంతాపం

నమస్తే తెలంగాణ సీనియర్ ఫొటో జర్నలిస్టు రాజేశ్ మృతి పట్ల బీఆర్‌ఎస్ కార్యనిర్వహణ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ కేవీ రమణాచారి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజేశ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని ప్రకటించారు.

# నాగోబా సన్నిధిలో బేటింగ్



నాగోబా ఆలయ ఆవరణలో కొత్త కోడళ్లు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 10 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో మెస్రం వంశీయులు శుక్రవారం అర్ధరాత్రి నిర్వహించిన మహాపూజతో నాగోబా జాతర ప్రారంభమైంది. పడియోరు (నాగోబా)ను దర్శించుకోవడానికి శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాగోబా సన్నిధిలో 202 మంది కొత్త కోడళ్ల పరిచయ కార్యక్రమం (బేటింగ్) నిర్వహించారు. ఇందులో భాగంగా కొత్తకోడళ్లు కోనేరు నుంచి కుండలలో నీటిని తీసుకొచ్చారు. అనంతరం కొత్తకోడళ్లకు నాగోబాను దర్శించుకునే అవకాశం కల్పించారు. సతిక్‌దేవత, నాగోబా దర్శనం అనంతరం కొత్తకోడళ్లు మెస్రం వంశీయుల పెద్దల ఆశీస్సులు పొందిన తరువాత కోడళ్లుగా స్వీకరించారు. మహిళలతోపాటు కొత్త కోడళ్ల ఆధ్వర్యంలో గోవాడ్‌లో 22 కితలవారీగా పూజలు చేసి శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అవ్వాల్ దేవతకు పూజలు చేసి ఉపవాస దీక్షలను విరమించి సామూహిక భోజనాలు చేశారు.

# 133 మంది తహసీల్దార్లు బదిలీ

**43 మంది ఆర్డీవోలకు సైతం స్థానచలనం**

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం భారీగా బదిలీలు చేపట్టింది. 43 మంది ఆర్డీవోలు/స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు, 133 మంది తహసీల్దార్లకు స్థానచలనం కల్పించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 11 మందికి పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచింది. కొంతకాలంగా వెయిటింగ్‌లో ఉన్న 13 మందికి కొత్తగా పోస్టింగ్ ఇచ్చింది. మల్టిజోన్-1లో 69 మంది తహసీల్దార్లను బదిలీ చేసింది. ఈ ఏడాది జూన్ 30 తర్వాత రిటైర్ కాబోతున్న మరో 15 మంది తహసీల్దార్లకు సూపరింటెండెంట్/డీఏవోలుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేసింది. మల్టి జోన్-2లో మొత్తం 43 మంది తహసీల్దార్లకు స్థాన చలనం కల్పించింది. త్వరలో రిటైర్ కాబోతున్న మరో ఐదుగురికి సూపరింటెండెంట్/డీఏవోలుగా పోస్టింగ్ ఇచ్చింది.



జీతాలు చెల్లించాలని కరీంనగర్‌లోని ఎంసీహెచ్ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

## జీతాలివ్వాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

విద్యానగర్, ఫిబ్రవరి 10: రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలలుగా తమ జీతాలు చెల్లించడం లేదని కరీంనగర్ జిల్లా దవాఖానకు చెందిన నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు శనివారం నగరంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) ప్రాంగణంలో నిరసనకు దిగారు. జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు విడుదల చేయాలని, 510 జీవో రాని ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని కోరారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్ చెల్లించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

## ఆగిన మరో ఆటో డ్రైవర్ గుండె

- కరీంనగర్ జిల్లా చామనపల్లిలో గుండెపోటుతో మృతి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 10: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోయిన మరో ఆటో డ్రైవర్ గుండెపోటుతో మరణించాడు. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని చామనపల్లికి చెం దిన బండపెల్లి భూమయ్య (40) పందొమ్మిదేండ్లుగా ఆటో నడుపుతూ బతుకు దెరువు సాగిస్తున్నాడు. ఆటో ద్వారా వచ్చే డబ్బుతో భార్యాబిడ్డలతోపాటు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను సాదుతున్నాడు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆ కుటుంబానికి శాపంగా మారింది. ఆటోకు గిరాకీ తగ్గిపోవడంతో భూమయ్య ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాడు. రెండు నెలలుగా పిల్లల ఫీజులు కట్టలేక, కిస్తీలు చెల్లించలేక సతమతమవుతున్నాడు. 'ఆటో నడవకుంటే మనమంతా ఎట్లా బతుకుడు?' అని తరుచూ భార్య శారదతో చెబుతుండేవాడు. శనివారం ఆటోతో చామనపల్లి నుంచి కరీంనగర్ వెళ్లాడు. అక్కడి ఓ టీకొట్టులో పేపర్ చదువుతూ చాయ్ తాగుతూ కుప్పకూలాడు. స్థానికులు సమీప దవాఖానకు తీసుకెళ్లగా మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. భార్యాబిడ్డలు దవాఖానకు చేరుకొని ఇంటిపెద్దదిక్కును చూసి భోరుమన్నారు. ఫ్రీబస్సు స్కీమే భూమయ్య మరణానికి కారణమని, 10 లక్షల పరిహారం ఇవ్వాలని ఆటో యూనియన్ నేతలు డిమాండ్ చేశారు.



మేడారంలో అడిషనల్ కలెక్టర్ వాహనాన్ని అడ్డుకుంటున్న వ్యాపారులు

# మేడారంలో షాపుల కూల్చివేత

- అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులు
- అడ్డుకున్న ఆదివాసీ చిరు వ్యాపారులు

తాడ్వాయి, ఫిబ్రవరి 10: ఆదివాసీల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారలమ్మ కొలువైన మేడారంలో ఆదివాసీ చిరు వ్యాపారుల షాపులను శుక్రవారం రాత్రి అధికారులు కూల్చేశారు. మహాజాతర సందర్భంగా గద్దెల పరిసరాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న షాపులను తొలగించాలని నోటీసులు ఇవ్వడంతో వ్యాపారులంతా సరుకులను ఖాళీ చేశారు. శుక్రవారం రాత్రి కావడంతో రేకులను శనివారం ఉదయం తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ అదే రాత్రి మేడారం చేరుకుని రెండు జేసీబీలతో రేకులను ధ్వంసం చేస్తూ షాపులను కూల్చేశారు. దీంతో ఆగ్రహించిన వ్యాపారులు వాగ్వాదానికి దిగారు. అయినా వినకుండా అలాగే కూల్చేస్తుండటంతో వ్యాపారులు ఆందోళన చేపట్టారు. కూల్చివేత పనులను నిలిపేసి కారులో వెళ్తుండగా.. తమకు న్యాయం చేసిన తరువాతనే వెళ్లాలంటూ చిరువ్యాపారులు అడిషనల్ కలెక్టర్ వాహనాన్ని అడ్డుకున్నారు. 'సీతక్క డౌన్ డౌన్, పోలీసులు డౌన్‌డౌన్, కలెక్టర్ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఎస్పీ వెంటనే మేడారం చేరుకున్నారు. ఆదివాసీ వ్యాపారులు, పూజారుల సంఘం అధ్యక్షుడితో మాట్లాడి జరిగిన నష్టాన్ని పూడుస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. శనివారం మేడారం చేరుకున్న కలెక్టర్.. అడిషనల్ కలెక్టర్‌కు మేడారంలో బాధ్యతలు అప్పగించబోమని, తప్పు జరిగిందని వ్యాపారులు, పూజారులను కోరినట్టు సమాచారం.



నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని శివాజీ బీడీ కంపెనీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన బీడీ కార్మికులు

## పని కల్పించాలని బీడీ కార్మికుల ఆందోళన

**నిర్మల్ జిల్లా భైంసాలో నిరసన**

భైంసా, ఫిబ్రవరి 10 : నెలకు 26 రోజులు పనికల్పించాలని డిమాండ్ చేస్తూ బీడీ కార్మికులు ఆందోళన చేపట్టారు. శనివారం ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని శివాజీ బీడీ కంపెనీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. దాదాపు 200 మంది మహిళా కార్మికులు మధ్యాహ్న సమయంలో రెండు గంటలపాటు బైఠాయించారు. ఈ సందర్భంగా బీడీ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత మాట్లాడుతూ.. నెలలో 8 రోజులు మాత్రమే పని కల్పించడంతో కార్మికులు కుటుంబాలను పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు 26 రోజులు పని చూపించాలని, వెయ్యి బీడీలకు సరిపడా మంచి తునికాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాన్ పీఎఫ్ కార్మికులందరికీ పీఎఫ్ నంబరు లేకపోవడం వల్ల వారికి రావాల్సిన సౌకర్యాలు పొందలేకపోతున్నారని ఆవేదన చెందారు. వెంటనే నాన్ పీఎఫ్ కార్మికులందరికీ నూతన పీఎఫ్ కల్పించాలని కోరారు.

